

# ఏడెకరాలకు సౌర మోటారు

## కాట్రేనిపాడులో రైతు ఆదర్శ సాగు

(ముసునూరు- ఆన్‌లైన్)



రాష్ట్రంలో రైతులంతా చుక్క నీటి కోసం అటు ఆకాశం వైపు.. ఇటు కరెంటు ఎప్పుడొస్తుందాని మోటారువైపు దిక్కులు చూస్తుంటే.. కృష్ణాజిల్లాలోని ఆ రైతు మాత్రం నడి వేసవిలో కూడా కరెంటు కోతల గురించి పట్టించుకోకుండా ఎంచక్కా మోటారు వేసుకుని పంటకు నీరు పెట్టుకుంటున్నాడు! పేరుకు ఉచితమే అయినా.. ఆ విద్యుత్ సరఫరా సరిలేదన్న బాధ ఆయనకు లేదు. ఎందుకంటే.. ఆయన వద్ద ఉన్నది సోలార్ మోటార్! ఎక్కడైనా సోలార్ విద్యుత్‌దీపాలు, మహా అయితే వాటర్ హీటర్ల గురించి విన్నాం గానీ పొలాల్లో మోటార్లు కూడా సౌరశక్తితో పనిచేస్తాయా అనుకుంటున్నారా.. అయితే మీరు కృష్ణాజిల్లా ముసునూరు మండలం కాట్రేనిపాడు వెళ్లి అక్కడి రైతు హేమ నిరంజన్‌రావు పొలం చూడాల్సిందే. మూడేళ్లుగా ఆయన ఇదే మోటారుతో సాగుచేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. నిరంజన్‌రావుకు ఏడెకరాల పొలం ఉంది. మొదట్లో ఆయన సాగునీటి కోసం నానా కష్టాలు పడేవారు. హైదరాబాద్‌లోని ఒక సోలార్ కంపెనీలో ఉద్యోగరీత్యా స్థిరపడిన ఆయన కుమారులు తండ్రి పడుతున్న కష్టాన్ని ప్రత్యక్షంగా చూశారు. తాము పనిచేసే కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి తమ భూమిలో సోలార్ విద్యుత్ పంపును బిగించాలని కోరారు. 2009 జూన్ 15న సోలార్ మోటారు పంపును అమర్చడంతో నిరంజన్‌రావు కష్టాలు కడతేరాయి. రోజూ ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు నిరంతరాయంగా ఈ సౌరశక్తి మోటారు పని చేస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లనుంచి ఒక్కసారి కూడా మరమ్మతులు రాలేదని చెప్పారు. ఏడెకరాల భూమికి సరిపోయేలా రెండున్నర అంగుళాల బోరును 225 అడుగుల లోతు వేయించి, 12.5 హెచ్‌పీ మోటారు బిగించానని, మొత్తం రూ.12 లక్షలు ఖర్చయిందని వివరించారు. అసలు పూర్తిగా సౌరశక్తితోనే పనిచేసే మోటారు ఉండటం అరుదు. దీన్ని చుట్టుపక్కల గ్రామాల వారు ఆసక్తిగా వచ్చి చూస్తున్నా, ఖర్చు ఎక్కువ కావడంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఒక హార్స్ పవర్ మోటారుకు దాదాపు లక్ష రూపాయల ఖర్చవుతుంది. రైతుకు అండగా ఉండే సౌరశక్తి మోటారుకు అయ్యే వ్యయంలో కేంద్రం కేవలం 30 శాతం సబ్సిడీ మాత్రమే అందిస్తోందని నిరంజన్‌రావు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం సబ్సిడీ పెంచితే అనేక మంది రైతులు దీనిని ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వస్తారన్నారు.